క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు జగదీష్‌రెడ్డి పరామర్శ

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన చీమల నర్సయ్య, పోతుగంటి సురేష్ సోమవారం అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మంగళవారం మృతుల భౌతికకాయాలను సందర్శించి, మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. అలాగే పోతుగంటి సైదులు కుమారుడు ఉదయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, కూరం వెంకన్న, దోమల బాలమల్లు, చిప్పలపల్లి సోమయ్య, చిప్పలపల్లి చిరంజీవి, ఎల్క సైదులు, అనంతుల సత్తయ్య, కన్నెబోయిన భద్రయ్య, కత్తుల వెంకన్న, అంజయ్య, మహేష్, దేవరకొండ మురళి, చిప్పలపల్లి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయిరాం

సూర్యాపేటటౌన్ : ద్విచక్ర వాహనదారులు త్రిబుల్ రైడింగ్ చేయద్దని, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడొద్దని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. మంగళవారం పట్టణంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నందున వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు, జైలు శిక్షలు తప్పవన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఎంఈఓ, దాత

ఆత్మకూర్ (ఎస్) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నెమ్మికల్ జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థి, ప్రస్తుత కట్టంగూర్ తహసీల్దార్ జి.ప్రసాద్ నాయక్ అందించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మండల పరిధిలోని నెమ్మికల్, ఏనుబాముల జెడ్పీహెచ్ఎస్‌లు, ఏపీకే తండా యూపీఎస్, నెమ్మికల్ పీఎస్, దుబ్బతండా, పీపానాయక్, లాల్‌తండా విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ప్రసాద్ నాయక్, ఎంఈఓ ధారాసింగ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యంతో ప్రయోజకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తావురియానాయక్, సూర్యాపేట డివిజన్ అధ్యక్షుడు వి.వెంకన్ననాయక్, ప్రధానోపాధ్యాయులు విమలబాయి, రమేష్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సైదులు, నాగేందర్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ పోరాటం

అర్వపల్లి : విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేస్తోందని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధ్యయనం పోరాటం నినాదంతో ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని చెప్పారు. పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాంచాని వివేకానంద, వజ్జె జశ్వంత్, ఉపాధ్యక్షుడిగా సాయిచంద్, సహాయ కార్యదర్శులుగా శ్రీధర్, నరేష్, గణేష్, సాయి, శివ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తిరుమలగిరి : మాలిపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



సూర్యాపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం, వెలిశాల గ్రామాలలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి పంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర వచ్చేలా చూస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఒకేదఫాలో చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం



నాగారం : పస్తాలలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అందించే మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం పస్తాల, ఫణిగిరి, మామిడిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ మారయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యానాల ఇంద్రసేనారెడ్డి, ఏపీఎం శోభారాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, వడ్లకొండ వెంకన్న, వేణు, వలీ, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

సూర్యాపేట : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని ఇమాంపేట వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇమాంపేట – 1, ఇమాంపేట – 2, కేసారం ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు ఎస్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో టేకుమట్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాలకృష్ణ, ఏపీఎం రణపంగి వెంకయ్య, సీసీ సైదులు, ఏఈఓ స్వాతి, కార్యదర్శి జోత్స్న, కుంచం అంజయ్య, వాంకుడోత్ బాలాజీ, ఉపేందర్, నకిరేకంటి సతీష్, గోపాల్ రెడ్డి, చింత శ్రీను, పిల్లల రమేష్ నాయుడు, యాట ఉపేందర్, కర్ణాకర్ రెడ్డి, ధర్మానాయక్, గుండా ఉదయ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ వీరరాఘవులు

సూర్యాపేటటౌన్ : గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. సోమవారం పట్టణంలోని జమ్మిగడ్డ సమీపంలోని జాతీయ రహదారి వద్ద స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేటు లేని ఒక పల్సర్ మోటారు సైకిల్‌పై శాంతినగర్ వైపు నుంచి సూర్యాపేట పట్టణంలోనికి వస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అయితే వారి వద్ద ఒక కిలో 20గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిని విచారించగా ఒకరు చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన గాజుల ప్రవీణ్, మరొకరు చివ్వెంల మండలం మున్యానాయక్‌తండాకు చెందిన బానోతు మహేష్‌నాయక్‌గా తెలిసిందని తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం దగ్గర అరకు ప్రాంతం వెళ్లి, గంజాయిని కొనుక్కొని ఆ గంజాయిని సూర్యాపేటకు తీసుకువచ్చి, సూర్యాపేట, పరిసర ప్రాంతాలలో అమ్ముతుంటారని తెలియజేశారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ, రాస్తారోకో



కోర్టు ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : హైదరాబాద్ నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు మహ్మద్ ముత్తబా అలీపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం న్యాయవాద పరిరక్షణ చట్టం బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, కోశాధికారి ఎండీ అబ్దుల్ లతీఫ్, న్యాయవాదులు వసంత సత్యానారాయణ పిళ్లే యాదవ్, నల్లగుంట్ల అయోధ్య, తల్లమల్ల హస్సెన్, చంద్రమౌళి, చంద్రకాంత్, దాకా శ్రీనివాస్ నాయుడు, వీరేష్ కుమార్, మీసాల శ్రీనివాస్, కట్ట సుధాకర్, మంగునాయక్, మంచినీళ్ల లక్ష్మణ్, మాంద్ర మల్లయ్య, రామక్రిష్ణ, అనిల్, కారింగుల వెంకటేశ్వర్లు, విష్ణు స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలపై పోరాడుదాం



సూర్యాపేట అర్బన్ : నిరసన తెలుపుతున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. దేశంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి వచ్చాక తన మతోన్మాద, ఫాసిస్ట్ చర్యలను పెంచి పోషిస్తూ ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తూ గొడవలకు కారణం అవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, మారసాని చంద్రకళ, సంతోషి, గొద్దలి నరసన్న పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించాలి

నాగారం : కేంద్ర ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. మంగళవారం పసునూర్ గ్రామంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దేశంలోని కార్మికులందరూ వేతనాలు పెరగాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. మరోవైపు రైతులు పంటలకు గిట్టుబాటు ధర కావాలని, కనీస మద్దతు ధర చట్టం తేవాలని ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వేర్పుల లక్ష్మయ్య, మామిడి సుధాకర్, వేర్పుల పరశురాం, ఎర్రసాని అంజయ్య, ఉప్పుల సోమయ్య, కమటం వెంకన్న పాల్గొన్నారు.

దరఖాస్తులు అందించాలి

నూతనకల్ : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో అందించాలని ఎంపీడీఓ సునీత కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ ద్వారా 999దరఖాస్తులు వచ్చాయని, కార్యాలయంలో మాత్రం 222 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. ప్రతి దరఖాస్తుదారుడు కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను అందించాలని సూచించారు.

రేషన్ షాపుల తనిఖీ

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న సన్నబియ్యాన్ని డీలర్లు ప్రజలకు సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలోని రేషన్‌షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మద్దిరాల : రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సోమయ్య అనారోగ్యానికి గురికావడంతో వైద్యఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అతడికి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దగ్గుల మల్లయ్య మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో బర్పటి ఉపేందర్, స్వరూప్, సోమేశ్వర్‌రావు, వెంకటయ్య పాల్గొన్నారు.

రేషన్‌కార్డుపై 12 రకాల వస్తువులు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

సూర్యాపేట అర్బన్ : రేషన్ షాపుల్లో సన్న బియ్యంతోపాటు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చినట్లు 12 రకాల వస్తువులు ఇవ్వాలని కోరుతూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడారు. 2014 ముందు వరకు రేషన్ షాపుల్లో బియ్యంతోపాటు ఉప్పు, పప్పు, చింతపండు, కిరోసిన్, మంచి నూనె తదితర 12 రకాల వస్తువులు ఇచ్చే వారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అవన్నీ తీసేసి కేవలం బియ్యం మాత్రమే ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇవ్వడం హర్షించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షులు సంతోషిమాత, సహాయ కార్యదర్శి జయమ్మ, నాయకులు కల్పన, ఐతరాజు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 25, 26, 27వ తేదీల్లో ఖమ్మంలో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నిక చేసిన 600 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాలను, ఉద్యమాలను సమీక్ష చేసుకొని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, తన్వేష్, జశ్వంత్ దీపక్, శివ, రీనా, మమత, సౌజన్య, యామిని పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి



నూతనకల్ : అల్లునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్ : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లునూరు గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీలో భాగంగా బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లెం కృష్ణారెడ్డి, దరిపెల్లి వీరన్న, నకిరేకంటి మధు, భూరెడ్డి సంజీవరెడ్డి, పన్నాల మల్లారెడ్డి, పసుల అశోక్ యాదవ్, తొనుకునూరి సైదులుగౌడ్, బంటు బద్రి, బంటు క్రాంతి, రాజబహుదూర్‌రెడ్డి, అనంతుల శ్రీను, ఇరుగు కిరణ్, గునగంటి వెంకన్న, మన్నెం దశరథ, బద్దం ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

నాగారం : భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్ పానుగంటి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పస్తాల గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాయకులు పసుపులేటి వెంకట్‌రెడ్డి, జాజుల వీరయ్య, ఎల్మకంటి సోమయ్య, వడ్లకొండ వెంకన్న, ఆలకుంట్ల బాలక్రిష్ణ, ఎస్‌కే.వలీ, మల్లేష్, అంజయ్య, కుమారస్వామి, సాయికుమార్, బయ్యం వెంకన్న, ఉపేందర్, చంద్రశేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : పస్తాలలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

గ్రామసభలపై పట్టింపేదీ?

- ప్రజల భాగస్వామ్యం లేకుండానే సభలు
- నామమాత్రంగా నిర్వహణ
- కరువైన అధికారుల పర్యవేక్షణ

చివ్వెంల: ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో గ్రామసభలపై పట్టింపు లేకుండా పోయింది. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు అధికారులు హాజరయ్యారా.. సంతకాలు పెట్టారా అన్నట్లుగా ప్రజల భాగస్వామ్యం లేకుండానే నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే గ్రామసభలపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడ తిష్ట వేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు, లబ్ధిదారుల ఎంపిక వివరాలను సభల ద్వారా వివరించాలి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు నామమాత్రంగా నిర్వహిస్తున్నా అధికారులు కూడా పర్యవేక్షించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ముందస్తుగా తెలియపర్చాలి..

రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించే తేదీని ఒకరోజు ముందుగానే గ్రామ పంచాయతీతోపాటు, అనుబంధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి దండోరా వేయించి తెలియపర్చాలి. నిబంధనల ప్రకారం విధిగా వివిధ శాఖల అధికారులు, ఊరి జనాభాలో సుమారు 20 శాతం మంది గ్రామ సభకు హాజయ్యేలా చూడాలి. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉన్నందున సభలను పంచాయతీ కార్యదర్శులే



వాల్యతండా గ్రామ పంచాయతీ కార్యాలయం

నిర్వహిస్తున్నారు. పంచాయతీల ఆదాయ వ్యయాలపై నివేదికలను కార్యదర్శులు చదివి వినిపిస్తారు. కానీ ఆయా నిబంధనలు మండలంలో ఎక్కడా అమలు కావడం లేదు. ఫలితంగా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతూ పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీల్లో గ్రామసభలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం. సభల నిర్వహణపై కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు సభకు స్వచ్ఛందంగా హాజరు కావాలి. గ్రామసభల నిబంధనలను కార్యదర్శులు తప్పకుండా పాటించాలి.

– సీహెచ్.సంతోష్ కుమార్, ఎంపీడీఓ, చివ్వెంల

భూసారం, భూగర్భజలాలను సంరక్షించాలి

నూతనకల్ : ప్రతి ఒక్కరూ భూసారాన్ని, భూగర్భ జలాలను సంరక్షించాలని సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జాల్‌తండాలో భూసారం, భూగర్భజలాల పరిరక్షణపై నిర్వహించిన కళాజాత ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. నీటి వృథాను అరికట్టాలని, అలాగే నీటి నిల్వలను పెంచాలని తెలిపారు. భూమిలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వాడి భూసారాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు వీర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, మేడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సిరిపంగ రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలను తగ్గించాలి

సూర్యాపేట అర్బన్ : పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మంగళవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, ఉదయగిరి, పోలెబోయిన కిరణ్, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో దొంతరబోయిన శేఖర్, ప్రశాంత్, ఆడెపు సురేష్, గంగరాజు, చిన్నబోయిన సతీష్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ విధానాలు పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు.



సూర్యాపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

వన నర్సరీ పరిశీలన

అర్వపల్లి : ఎండల నుంచి మొక్కలను కాపాడాలని ఎంపీడీఓ టి.గోపి నిర్వాహకులకు సూచించారు. మండల పరిధిలోని కుంచమర్తి వననర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలవ్యాప్తంగా 17 వననర్సరీలలో 1.70 లక్షల మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మేడి ఏడుకొండలు, వనసేవకులు పాల్గొన్నారు.

మాలిపురం వాసికి డాక్టరేట్



వెంకటేశ్వర్లు

తిరుమలగిరి: మాలిపురం గ్రామానికి చెందిన పోతరాజు వెంకటేశ్వర్లు మంగళవారం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ రమేష్ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు గానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం చరిత్ర విభాగం అధ్యక్షులు డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో డాక్టరేట్ తీసుకున్నారు.

ఎండలకు జాగ్రత్తలు పాటించాలి

అర్వపల్లి : ఎండ తీవ్రతకు గురికాకుండా బాలికలు తగు జాగ్రత్తలు పాటించాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నాగరాణి సూచించారు. ఎండకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ ఎస్.జ్యోతి, ఏఎన్ఎం స్వాతి, సీఆర్‌టీలు విజయశ్రీ, అరుణ, విజయ, లలిత, మాధవి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని కోటమైసమ్మ బజార్‌కు చెందిన కోల నాగయ్య(43) చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం సూర్యాపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అతడు అనుమానస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగయ్య మృతిపై అనుమానం ఉందని అతడి భార్య భవాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

పోషణ పక్వాడపై గర్భిణులకు అవగాహన

తుంగతుర్తి : వెలుగుపల్లి, కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై గర్భిణీలకు అవగాహన కల్పించారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా ఈ నెల 8 నుంచి 22 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంజుల అమృత, లక్ష్మీబాయి, శారద పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

చివ్వెంల: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధం అయ్యింది. ఈ సంఘటన మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మున్న మల్లమ్మ ఇంటి పక్కన ఉన్న దొడ్డిలో 250 మోపుల గడ్డిని వాముగా వేసింది. మంగళవారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు లేచాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు చల్లార్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : మండల పరిధిలోని కుడకుడ గ్రామ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడకుడ గ్రామంలోని వినాయక్ నగర్, స్నేహనగర్, పీఎంఆర్, జీఎంఆర్ టౌన్ షిప్, ఎస్సీ కాలనీ, భాగ్యనగర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తిరుమలగిరి : తిరుమలగిరి సబ్ స్టేషన్ నుంచి తొండ ఫీడర్, జలాల్‌పురం సబ్ స్టేషన్ పరిధిలోని వెలిశాల ఫీడర్లలో 11కేవీ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అర్వపల్లి : విద్యుత్‌లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ మండల ఏఈ వాస శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. కొమ్మాల, మర్రిబాయి తండా, మేడిబాయితండా, జాజిరెడ్డిగూడెం వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

నాగారం : నాగారం మండల కేంద్రంలోని 33/11 కేవీ, ఫణిగిరిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో నాగారం, డి.కొత్తపల్లి, ఫణిగిరి, గుండెపురి, లక్ష్మాపురం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ మహేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.